# పంట మార్పిడి.. అధిక రాబడి

- రోగకారక కీటకాల కట్టడికి ఎంతో మేలు
- ఒకే తరహా పంటతో నష్టమే
- పంటల మార్పిడితో భూసారం వృద్ధి
- సాగులో వైవిధ్యం చూపితే ప్రయోజనాలు అధికం


పొలంలో ట్రాక్టర్‌తో సేద్యం చేస్తున్న రైతు

**రాజుపాళెం :** పొలంలో ప్రతిసారి వేసిన పంటనే మళ్లీ వేయడం వలన దిగుబడులు తగ్గడంతో పాటు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా ఏటా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకే రకం కాకుండా అనేక రకాల పంటలను క్రమపద్ధతిలో సాగుచేస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చని చెబుతున్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి నష్టం కలగకుండా అధిక దిగుబడులు సాధించవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అధిక లాభం పొందవచ్చు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు పంట మార్పిడి అవశ్యకతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

**ఒకే తరహా పంట సాగుతో నష్టాలు**

■ ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడ పీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.

■ వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలకు మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.

■ నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగు చేసుకోవాలి.

■ ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. ఉదాహరణకు జొన్న-పత్తి.

■ నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవాలి.

**పంటల మార్పిడితో భూసారం వృద్ధి**

■ వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రీయ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది.

■ వరి తర్వాత అపరాలు లాంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే శిలింధ్రాల ఉధృతి తగ్గుతుంది.

■ వరి తర్వాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ లాంటివి సాగు చేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

**పంట మార్పిడితో మంచి దిగుబడులు**



ఏటా ఒకే రకం పంట సాగు చేయకుండా పంట మార్పిడితో పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం చాలా మంది రైతులు తమ పొలాల్లో ఒకే రకం పంటను తరచూ సాగు చేస్తున్నారు. నీటి పారుదల ఉన్న చోట వరి తప్ప ఇతర పంటలు వేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించుకునేందుకు పంట మార్పిడి విదానం చాలా ఉత్తమం. రైతులంతా విధిగా పంట మార్పిడి చేపట్టాలి.

– శివరామ కృష్ణారెడ్డి, వ్యవసాయాధికారి, రాజుపాళెం మండలం

## ఎమ్మెల్యేకు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల వినతి


వరదరాజులరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్టాఫ్ నర్సులు

**ప్రొద్దుటూరు క్రైం :** కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ సభ్యులు ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. నర్సులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కమిటీ సభ్యులు, స్టాఫ్ నర్సులు వరదరాజులరెడ్డికి శాలువ కప్పి సన్మానించారు. స్టాఫ్ నర్సులు లక్ష్మీసుధ, సువర్ణ, రాణి, అరుణ, సుబ్బమ్మ, రమణి పాల్గొన్నారు.

**ప్రొద్దుటూరు :** మండలంలోని అమృతానగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని బుధవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు వినతిపత్రం అందజేశారు. 2008, 2018లో దాదాపు 2,500 మంది పేదలకు అమృతానగర్‌లో ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అయితే కరెంట్, మంచినీరు, రోడ్లు, గృహ రుణాలు మంజూరు చేయడం లేదని తెలిపారు. త్వరలో అమృతానగర్ సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## క్లుప్తంగా

### రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న భరత్ కుమార్‌రెడ్డి

**ప్రొద్దుటూరు :** రక్తదానం.. ప్రాణదానంతో సమానమని మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ అధ్యక్షుడు మోరే లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బయమ్మ అనే మహిళకు అత్యవసరంగా ఏ పాజిటివ్ రక్తం అవసరం కాగా, ఆమె కుటుంబీకులు మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్‌ను సంప్రదించారు. దీంతో లక్ష్మణరావు, ఫౌండేషన్ సభ్యుడు భరత్ కుమార్‌రెడ్డితో సురక్ష బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేయించారు. రక్తదాతను ఫౌండేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మునీంద్ర, బయమ్మ కుటుంబసభ్యులు అభినందించారు.

### గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


కాలువలో పూడిక తీస్తున్న కార్మికుడు

**పోరుమామిళ్ల :** గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి రోగాలు విజృంభించకుండా చూడాలని అధికారులు ఆదేశించడంతో అన్ని పంచాయతీల్లో కార్యదర్శులు పనులు చేపట్టారు. బుధవారం రంగసముద్రం పంచాయతీలో డ్రైనేజీల్లో పూడికతీత, మురుగు నీరు నిల్వ లేకుండా చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మురుగు కాలువల్లో ఆయిల్‌బాల్స్ వేయడం పనులు చేపట్టారు. మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాదరావు, ఈఓపీర్డీ రాజీవ్‌రెడ్డి పనులు పర్యవేక్షిస్తున్నారు. పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. వైద్య సిబ్బంది మురుగు కాలువల్లో ఆయిల్‌బాల్స్ వేస్తున్నారు.

### ఆలయ భూముల వేలం

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక పాతమార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం కల్లూరు గ్రామంలోని కోదండరామ స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించి భూముల వేలం ఒక సంవత్సర కాలపరిమితికి వేలం నిర్వహించారు. 11 సర్వేనంబర్‌లలోని 32 ఎకరాలకు ఈ వేలంపాట నిర్వహించారు. 25 మంది రైతులు పాల్గొనగా 9 మంది రైతులు రూ.5,000 డిపాజిట్ చెల్లించారు. 7 మంది రైతులు వేలంపాటలో రూ.1,44,200 పాడి ఈ భూములను చేజిక్కించుకున్నారు. కాగా గత ఏడాది ఇదే భూములకు రూ.2.30లక్షలు పలికాయి. కార్యక్రమంలో ఈఓ రమణారెడ్డి, మైదుకూరు గ్రూప్ ఆఫ్ టెంపుల్ ఈఓ ఎంఎస్ ప్రసాద్, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు సామగ్రి పంపిణీ


విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

**బద్వేలు అర్బన్ :** మాజీ జెడ్పీటీసీ సభ్యులు, ప్రముఖ వ్యాపారవేత్త స్వర్గీయ రాచపూడి నాగభూషణం తృతీయ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎరుకలవీధి ప్రాథమిక పాఠశాలలో 100 మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, వెటర్నరీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ దిలీప్‌గుప్త మాట్లాడుతూ విద్యార్థులు దాతలు అందించిన సహకారాన్ని అందిపుచ్చుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం నాయకులు మునగా చలమయ్య, మునగా పద్మనాభం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసవరాజు, ఉపాధ్యాయులు అరుణకుమారి, జయమ్మ, సంగీత సుధారాణి పాల్గొన్నారు.

### యునాని వైద్యాన్ని వినియోగించుకోండి

**ఖాజీపేట :** యూనాని వైద్య సేవలు అందరూ వినియోగించుకోవాలని, ఎలాంటి అపోహలకు గురికావద్దని వైద్యాధికారి డాక్టర్ షబానా అన్నారు. ఖాజీపేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

**దువ్వూరు :** మండలంలోని అధికారులందరూ ప్రజా సమస్యలపై దృష్టి సారించి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి సూచించారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ సభాభవనంలో ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేసి ప్రజలకు మంచినీటిని అందించాలన్నారు. మండల ప్రత్యేక అధికారి మైఖేల్ మాట్లాడుతూ వర్షాకాలంలో డయేరియా వ్యాధులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో హౌసింగ్ లబ్ధిదారుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. మండల అధికారులందరూ సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ సుగుణ శ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, వర్షం నీరు రోడ్లపై నిలబడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ భాస్కర్ మాట్లాడుతూ మండలంలో 57 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, అందులో 3,554 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, తహసీల్దార్ ఉమారాణి, మండల ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వాడకం ప్రమాదకరం


మాట్లాడుతున్న సెబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కుమార్



మైదుకూరులో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీ

**ప్రొద్దుటూరు క్రైం :** మాదక ద్రవ్యాల వాడకం అత్యంత ప్రమాదకరమని సెబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మాదక ద్రవ్యాల వాడకం, వాటి దుష్ఫలితాల గురించి బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం ఒక ప్రమాదకరమైన వ్యసనమన్నారు. ఈ నాటి యువతరాన్ని దారి మళ్లించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో డ్రగ్స్ వినియోగం తీవ్రమైందని చెప్పారు. ఇలాంటి వ్యసనాల బారిన పడిన వారిని డ్రగ్ అడిక్షన్ కేంద్రాలు, మానసిక వైద్యుల ద్వారా చికిత్స చేసి కాపాడవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులచే మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఎక్సైజ్ ఎస్ఐ సుధాకర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

**మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**మైదుకూరు :** మాదక ద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని మైదుకూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి సూచించారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, పోలీసు అధికారులు, విద్యార్థులు పట్టణంలోని మార్కెట్ సర్కిల్ నుంచి రాయల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్ అయ్యవారు రెడ్డి, అధ్యాపకులు అనురాధ, ఎస్‌బీ సుబ్బరాయుడు, చెన్నరాయుడు, నవనీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, కేవశ, అర్బన్ సీఐ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను బడిలో చేర్పించాలి


మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి కృష్ణప్ప

**ప్రొద్దుటూరు కల్చరల్ :** బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి ఉపవిద్యాశాఖాధికారి కృష్ణప్ప పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం నేను బడికి వెళతా అనే అంశంపై డివిజన్‌లోని 9 మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు, అంగన్‌వాడీ వర్కర్‌లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వివరాలను దీక్ష యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. నేను బడికి వెళతా కార్యక్రమం జూలై 25 వరకు కొనసాగనుందని ప్రతి ఒక్కరూ సహకరించి బడిబయట ఎవరూ పిల్లలు లేకుండా అందరిని పాఠశాలల్లో చేర్పించడానికి కృషి చేయాలని కోరారు.శిక్షణా తరగతుల్లో స్థానిక ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి, సెక్టోరియల్ ఆఫీసర్‌లు పీఎల్ఎన్ రాజు, రామాంజనేయరెడ్డి, ఇలియాస్‌ఖాన్, 9 మండలాల ఎంఈఓ 1, 2లు, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## సీబీఐటీ విద్యార్థుల ప్రతిభ

**చాపాడు :** స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఇటీవల విడుదల చేసిన డిప్లమో సెకండియర్ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలేజీకి చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సీఎంఈ విభాగంలో సి.భరత్‌కుమార్ 95.66 శాతం, సి.వెంకట మోక్షిత్ 95.2 2శాతం, సి.గురు గౌరి 94.77 శాతం, ఈసీఈ విభాగంలో ఇ.శ్రావణ్ కుమార్‌రెడ్డి 97.70శాతం, జి.గంగాభవానీ 95.40 శాతం, సి.నాగేశ్వరి 93.90 శాతం, వై.శివమౌనిక 95.0శాతం, ఎస్.లక్ష్మీ సాయి చరణ్ 95.20 శాతం, వి.జ్యోష్ణ 95 శాతం, ఈఈఈ విభాగంలో జి.మేరి 90 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. తమ కాలేజీ విద్యార్థులు సాధించి ఫలితాల పట్ల కళాశాల చైర్మన్ డా.వి. జయచంద్రారెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

### నేడు విజయనగరంలో వైద్య శిబిరం

**చాపాడు :** మండల పరిధిలోని విజయనగరం గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి కావ్య మాధురి తెలిపారు. గ్రామంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ గ్రామాల్లోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేయనున్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

### మధ్యాహ్న భోజనం పరిశీలన


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎస్‌ఓ, సర్పంచ్

**పోరుమామిళ్ల :** పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, సర్పంచ్ యనమల సుధాకర్ పరిశీలించారు. మెనూ ప్రకారం చేసిన వంటలు రుచికరంగా ఉండటంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులను అభినందించారు. షరీఫ్, లక్ష్మణరావు, రమణ పాల్గొన్నారు.

**విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి**

**ఖాజీపేట :** విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. ఖాజీపేట మోడల్ స్కూల్‌లో భోజనాన్ని ఆమె పరిశీలించారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు పనితీరుపై ఆరాతీశారు. ప్రిన్సిపాల్ నరసింహాతో పాఠశాల పనితీరుపై చర్చించారు. ఈఓపీఆర్‌డీ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ చంద్రభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డి

**బి.కోడూరు :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి భాస్కరరావు అధ్యక్షతన సచివాలయాల పంచాయతీ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, అన్నిశాఖల అధికారులకు సీజనల్ వ్యాధులు, జాతీయ కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మంచినీటి పైపులైన్లు లీకేజీ లేకుండా చూసుకోవాలని, రెగ్యులర్‌గా క్లోరినేషన్ చేయించాలని, ప్రతి బుధవారం నీటి శాంపిల్స్ తీసి ఆరోగ్యశాఖ వారిచే పరీక్ష చేయించాలని సూచించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమ లార్వా నియంత్రణ, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, ఫైలేరియా వంటి జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజల దోమల పట్ల తగు జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు విద్యాసాగర్, ఏపీఎంఓ సీతారామిరెడ్డి, ఎంఈఓ సునీల్‌కుమార్, ఈఓపీఆర్‌డీ హరి కృష్ణయాదవ్, పోరుమామిళ్ల సబ్ యూనిట్ అధికారి ఎం.నరసింహారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు

**ప్రొద్దుటూరు :** సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు కనీస వేతన చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు డిమాండ్ చేశారు. స్థానిక పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పాలకులు కార్మికుల శ్రమను దోచుకుంటున్నారే.. తప్ప కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్యం అయిన టీడీపీ, జనసేనతో చర్చించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరైనది కాదన్నారు. వ్యవసాయ చట్టాలను పూర్తిగా అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం కూల్చివేతతో ప్రారంభమైన పాలనకు ప్రజలు స్వస్తి పలికారని, ఈ విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వం గుర్తించుకోకపోతే పరిస్థితి పునరావృతం అవుతుందన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పట్ల ప్రస్తుత ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. ఉన్నతాధికారులను అవమానిస్తే పరిపాలనలో ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, జిల్లా సమితి సభ్యులు రామకృష్ణ, హరి, మచ్చా శ్రీను పాల్గొన్నారు.

## పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించండి


గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

**కాశినాయన :** మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ పోరుమామిళ్ల ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మిదేవి కోరారు. బుధవారం మండలంలోని నరసాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలోని ఐదేళ్లపైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆహార పోషణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, శైలజ, ఉపాధ్యాయులు గంగాభవాని, మల్లిక, పిల్లల తల్లులు, ఆయాలు, పాల్గొన్నారు.

## హోటళ్ల యజమానులు పరిశుభ్రత పాటించాలి


హోటల్‌లో ఆహారపదార్థాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

**ప్రొద్దుటూరు :** పట్టణంలోని హోటళ్ల యజమానులు పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని మైదుకూరు రోడ్డు, శివాలయం రోడ్డులోని హోటళ్లు, బిరియాని సెంటర్లను కమిషనర్ తనిఖీ చేశారు. హోటళ్లలో వంట గదులను, పదార్థాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిల్వ చేసిన పదార్థాలను ఉపయోగించవద్దని హోటళ్ల యజమానులకు సూచించారు. అపరిశుభ్రత వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు. నిషేధిత ప్లాస్టిక్ వాడకంపై ఆంక్షలు ఉన్నాయని, వాటిని వాడరాదని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్ బాషా, సుబ్బరాయుడు, కిరణ్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

**కాశినాయన :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ యు.సుబ్రమణ్యం అన్నారు. బుధవారం మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తే జీవో నెం. 117ను నూతన ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, తల్లికి వందనం కార్యక్రమాలను కేవలం ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు చంద్రశేఖర్, బాలరాజు, రామకృష్ణారెడ్డి, రవీంద్రబాబు, బాలఓబయ్య, ప్రదీప్, రమణారెడ్డి, వెంకటరామయ్య, ఎల్.రవీంద్రబాబు, ప్రసాద్, గోపాల్, ఓబులేసు, పిచ్చయ్య, పీర్‌బాషా పాల్గొన్నారు.

## ఎన్నికల నిధుల స్వాహాపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్

**బద్వేలు అర్బన్ :** సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కొరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ బద్వేలు నియోజకవర్గానికి కేటాయించిన నిధులలో పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయని, ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 7 మండలాల్లో ఎన్నికల నిర్వహణ కొరకు ఎన్నికల కమిషన్ రూ.1.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేయడంతో పాటు ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి రెమ్యునరేషన్ చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో రెమ్యునరేషన్ చెల్లించలేదని, అలాగే రిజర్వుగా ఉంచిన సిబ్బందికి కూడా రెమ్యునరేషన్ చెల్లించలేదని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్, ట్రెజరర్ గురయ్య, గోపవరం మండల అధ్యక్షుడు క్రిస్టఫర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మహమ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

**పోరుమామిళ్ల :** బద్వేలు నియోజకవర్గానికి ఎన్నికల నిర్వహణ కోసం కేటాయించిన నిధుల అవకతవకలపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. రమణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బందికి తాగునీరు, భోజనం, వసతి, రవాణా సదుపాయం తదితర ఏర్పాట్ల కొరకు నిధులు వినియోగించాలన్నారు. కానీ బద్వేలు నియోజకవర్గంలో ఫెసిలిటేషన్ సెంటర్‌లో నిబంధనలకు నీళ్లు వదిలి సౌకర్యాలు కల్పించకుండా సిబ్బందిని ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రమణ్యం, చంద్రహాసరెడ్డి, రామకృష్ణారెడ్డి, బాలరాజు, చంద్రశేఖర్, సుబ్బారెడ్డి, జనార్ధన్‌శెట్టి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.